# పచ్చని పల్లెల్లో చిచ్చు పెడుతున్న డ్రగ్స్

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, డిసెంబర్ 16: పచ్చని పల్లెల్లో డ్రగ్స్ చిచ్చు పెడుతున్నదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, యాంటీ డ్రగ్స్ రన్ ఫర్ వ్యవస్థాపక చైర్మన్ తోట కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అందె గ్రామంలో 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాలరాజు, శంకర్, బాల్‌నర్సయ్య, ఆయా పార్టీల నాయకులు లింగం, బైరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అందె భాస్కర్‌కు సన్మానం


అందె భాస్కర్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య, శంకర్, తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, డిసెంబర్ 16: మండలంలోని అందె గ్రామానికి చెందిన అందె భాస్కర్‌కు డప్పు వాయిద్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా సోమవారంగ్రామంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి (డీబీఎఫ్) పెద్దలింగన్నగారి శంకర్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి భాస్కర్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీన్, లింగం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్‌కు అంబేద్కర్ నేషనల్ అవార్డు



అంబేద్కర్ నేషనల్ అవారు అందుకుంటున్న గుర్రాల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 16: ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఢిల్లీలో 2024 సంవత్సరానికి అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు.ఈ అవార్డు కాన్షీరామ్ సోదరి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ సర్వన్‌కౌర్,అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును శ్రీనివాస్ అందుకున్నారు.

## యాదగిరికి కార్మిక రత్న అవార్డు


కార్మిక రత్న అవార్డు అందుకుంటున్న సిద్దిపేటకు చెందిన కార్మిక నేత యాదగిరి

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 16: బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక నేతలకు నేషనల్ అవార్డులు ప్రదానం చేస్తున్నారు. సిద్దిపేటకు చెందిన కార్మిక నేత సుంకరి యాదగిరి సేవలను గుర్తించి ఢిల్లీలో సోమవారం కార్మిక రత్న నేషనల్ అవార్డును బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అందజేశారు.

## అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన


కోహెడలో నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్పస్వాములు

కోహెడ, డిసెంబర్ 16: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన చేశారు. స్వామి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కమ్మం రమేశ్, ప్రధాన కార్యదర్శి కొండబత్తిని సతీశ్, కార్యదర్శి ఉపేందర్, సభ్యులు జయరామ్, సుమన్, సతీశ్, శ్రీనివాస్, నరేశ్, ప్రసాద్,కిరణ్, రవి, నరేశ్ పాల్గొన్నారు.


## జిల్లా వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌ల అరెస్టు



చేర్యాల: అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు


మిరుదొడ్డి: అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాకు వెళ్లకుండా జిల్లాలోని మాజీ సర్పంచ్‌లను సోమవారం వేకువజామున పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ ముందస్తుగా అరెస్టులు చేసి పీఎస్‌లో ఉంచినంత మాత్రన న్యాయపోరాటం ఆగదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ,డిసెంబర్ 16 :


తొగుట: అరెస్ట్ అయిన నరసింహులు


మద్దూరులో అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు


హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన మాజీ సర్పంచ్‌లు

## చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి


ఆర్ఐ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్16: చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి, ఆర్ఐ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి మాట్లాడుతూ గతంలో చేర్యాల ప్రాంతం తాలూకాగా, నియోజకవర్గంగా వెలుగొందిందని గుర్తు చేశారు. గత పాలకుల వైఫల్యం కారణంగా చేర్యాల నియోజకవర్గం జనగామ నియోజకవర్గంలో కలిసిందన్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలాలు సిద్దిపేట రెవెన్యూ డివిజన్‌లో మద్దూరు, ధూళిమిట్ట మండలాలు హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం వెంటనే నాలుగు మండలాలను కలుపుకొని చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫీ, నాయకులు రమేశ్, నారదాసు కనకయ్య, కొండూరు బాలయ్య, చిలుక శ్యామ్, ఎండీ సుభాని పాల్గొన్నారు.

# సజావుగా గ్రూప్-2


సిద్దిపేటలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి




సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్– 2 అభ్యర్థులను క్యూలో పంపిస్తున్న పోలీసులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 16: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–2కు సంబంధించి పేపర్–3, పేపర్–4 పరీక్షలు సజావుగా ముగిసినట్లు కలెక్టర్ ఎం.మను చౌదరి తెలిపారు. సోమవారం సిద్దిపేటలో 37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పేపర్–3 పరీక్షకు మొత్తం 13,717 మంది అభ్యర్థులకు 50.07 శాతంతో 6,869 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన పేపర్–4 పరీక్షకు 50.29 శాతంతో 6,899 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎన్ని గంటలకు పరీక్షా కేంద్రాలకు పేపర్లు వచ్చాయి, ఎంత మంది హాజరయ్యారు,బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...


సిద్దిపేటలో పరుగులు తీస్తున్న అభ్యర్థులు




సిద్దిపేటలో పరీక్ష రాయడానికి వస్తున్న మహిళా అభ్యర్థులు

## కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 16: సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట చెవిలో పూలుపెట్టుకుని వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేశ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొప్పరి శ్రీనివాస్, సిద్దిపేట ప్రధాన కార్యదర్శి రాజు, సమగ్ర శిక్షా జిల్లా అధ్యక్షుడు బాలకిషన్,జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



మాధవ్‌జాదవ్‌ను సన్మానిస్తున్న ఎంఈవో వరదరాజు తదితరులు

మద్దూరు (ధూళిమిట్ట), డిసెంబర్ 16: మద్దూరు మండలంలోని రేబర్తి పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ ఇటీవల కలెక్టర్ మనుచౌదరి నుంచి జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్నారు. సోమవారం స్థానిక హైస్కూల్‌లో హెచ్‌ఎం చంద్రభాను ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శిని సన్మానించారు. ఎంఈవో వరదరాజు మాట్లాడుతూ ఉత్తమ సేవలందించడం ద్వారా ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి) డిసెంబర్ 16 : కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని మోతెలో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్సై వి.హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కమ్మరి యాదగిరి (65) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. గతేడాది క్రితం భూమిని అమ్మడంతో వచ్చిన రూ.3.50లక్షలను పెద్ద కుమారుడు రమేశ్‌కు ఇచ్చాడు. వానకాలం వరి పంటకు వచ్చిన రూ.50 వేలను భార్య ప్రమీలతోపాటు చిన్న కుమారుడు రవికి ఇచ్చాడు. డబ్బుల విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని మంగోల్ గ్రామానికి చెందిన తన చిన్నమ్మ కుమారుడు భిక్షపతికి తరచూ చెప్పుకుంటూ తీవ్రంగా బాధపడే వాడు. జరుగుతున్న విషయాలను మనసులో పెట్టుకొని మనస్తాపానికి గురై సోమవారం ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి చిన్నమ్మ కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఏపీజీవీబీలో 28 నుంచి 31 వరకు సేవలు బంద్

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), డిసెంబర్ 16 : అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ ఏపీజీవీబీలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు సేవలకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీజీవీబీ మేనేజర్ రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. బ్యాంకులో యూపీఐ, నెట్ బ్యాంకు, ఏటీఎం సేవలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. గ్రామాల్లోని ఖాతాదారులకు డబ్బులు అత్యవసరం ఉంటే ఈ నెల 27వ తేదీలోపే తీసుకోవాలని సూచించారు.

### బాసంగారి రమేశ్‌కు నివాళి


సిద్దిపేటలో రమేశ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 16: సిద్దిపేట పట్టణంలో దివంగత నాయకుడు బాసంగారి రమేశ్ 24వ వర్ధంతి సందర్భంగా సోమవారం భారత్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుండ్ల యోగి, బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరామ్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బాసంగారి రమేశ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


దేవునూరి రవీందర్‌ను సన్మానిస్తున్న నేతలు

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 16: పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ అన్నారు. సిద్దిపేట కోర్టు ప్రాంగణం,వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్‌ను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితర నేతలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మర్పడగ క్షేత్రంలో శివముక్కోటి ఉత్సవాలు

- తరలివచ్చిన అశేష భక్తజనం


మర్పడగ క్షేత్రంలో మల్లికార్జునుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 16 : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో సోమవారం క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో శివ ముక్కోటి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మహాగణాధిపతి, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నీరాజ సేవ, సుబ్రమణ్యస్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు మోహన్‌కృష్ణశర్మ, వేదవ్యాస్, క్షేత్రనిర్వాహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, మల్లొజు శ్రీశైలం, దేవసాని మల్లేశం, లగిశెట్టి రాజు, చీకోటి రాజేంద్రప్రసాద్, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మర్పడగ క్షేత్రంలో భక్తుల సందడి

## అమ్మవార్లకు వెండి కవచాలు వితరణ


కవచాలను అప్పగిస్తున్న కుమార్ పద్మావతి దంపతులతో ఆలయవర్గాలు

చేర్యాల, డిసెంబర్ 16: మల్లికార్జునస్వామి క్షేత్రంలోని ఉపదేవాలయం ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు హైదరాబాద్ ఈసీఐఎల్‌కు చెందిన గిల్లా కుమార్‌పద్మావతి దంపతులు రూ.10లక్షలతో తయారు చేయించిన 11 కిలోల వెండి కవచాలను సోమవారం ఆలయంలో సమర్పించారు. మల్లికార్జునస్వామి నివేదన తయారీశాలలో రూ.3లక్షల విలువైన ఫర్నిచర్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, శంకర్, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఉప ప్రధానార్చకుడు సాంబయ్య, ముఖ్య అర్చకులు ఆంజనేయులు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## మల్లన్న ప్రధాన రోడ్ల పై సామగ్రి పెట్టొద్దు

చేర్యాల, డిసెంబర్ 16 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా వ్యాపార, వాణిజ్యవర్గాలు రోడ్ల పై ఎలాంటి సామగ్రి పెట్టొద్దని ఎస్సై రాజు కోరారు.సోమవారం ఆయన మాట్లాడుతూ దేవాలయం ప్రధాన రహదారులతో పాటు కల్యాణోత్సం నిర్వహించే దారిలో వ్యాపారులు ఎటువంటి సామాన్లు పెట్టొదని కోరారు.ఎవరైన సామాన్లు పెడితే వాటిని తొలిగించడంతో పాటు లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో కార్యదర్శి హరిప్రసాద్, పీసీలు తిరుపతి, శ్రీశైలం ఉన్నారు.

## బస్సు షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం చేయాలి


కొమురవెల్లి కమాన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, డిసెంబర్ 16: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, వాళ్లంతా రాజీవ్ రహదారి కొమురవెల్లి కమాన్ వద్ద దిగుతారని వాళ్లకు కనీస సౌకర్యాలు లేవని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కొమురవెల్లి కమాన్‌వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న దర్శనం కోసం వచ్చే వాళ్లకు బస్సు షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం చేయాలన్నారు. కమాన్ నుంచి కొమురవెల్లి దేవస్థానం వరకు రోడ్డుపై పడిన గుంతలకు మరమ్మతులు చేయడంతో పాటు ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, వరలక్ష్మి, వుల్లంపల్లి సాయిలు, తాడూరు మల్లేశం, బొక్కెల్లి బాలకిషన్, సార్ల యాదయ్య, రాంరెడ్డి, ఆరుట్ల రవీందర్, నరేశ్, భరత్‌కుమార్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జీరో టీలేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయాలి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో

తొగుట,డిసెంబర్ 16: జీరో టీలేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేస్తే రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని ఏవో నాగార్జున అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిపేట క్లస్టర్ పరిధిలో జీరో టీలేజ్ పద్ధతిలో వేసిన మొక్కజొన్న పంటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పెరుగుతున్న క్రమంలో వచ్చే కలుపు మొక్కలను మాత్రమే నివారణ చేసుకుంటే అధికంగా లాభాలు వస్తాయని సూచించారు. జీరో టీలేజ్ పద్ధతిలోనే మొక్కజొన్న పంట సాగుచేసుకోవాలని కోరారు.

### ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

చేర్యాల, డిసెంబర్ 16 : మండలంలోని చుంచనకోటలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నాలుగు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంటి వద్ద పార్కుచేసి ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకుపోవడంతో యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మాసాలుగా చేర్యాల, మద్దూరు ఉమ్మడి మండలాల్లో ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ చేస్తున్నారు.ట్రాక్టర్ల బ్యాటరీల బాధితులు సోమవారం చేర్యాల పోలీసులను ఆశ్రయించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, డిసెంబర్ 16 : పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా గురుకుల పాఠశాలలో మహిళా లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మన్విచంద్ సోమవారం ప్రకటనలో కోరారు. రూ.14,170 వేతనం గల లైబ్రేరియన్ పోస్టుకు బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రేరియన్ సైన్స్ అభ్యసించిన మహిళలు అర్హులన్నారు. దరఖాస్తులను వెంటనే సమర్పించాలని, మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

### పరీక్ష ప్యాడ్స్ అందజేత

చేర్యాల, డిసెంబర్ 16: మండలంలోని నాగపురి ఉన్నత పాఠశాలలో 37 మంది విద్యార్థులకు చేర్యాల వీరభద్ర బుక్ డిపో యజమాని వంగపల్లి విజయ్‌కుమార్ తన కుమార్తె విస్మిత పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పరీక్ష ప్యాడ్లు, స్వీట్లు తన మిత్రుడు విజయ్‌కుమార్‌తో అందజేశారు. హెచ్‌ఎం ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పద్మ, నిరుపమా, మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, మాధవి, యాదగిరి, స్వర్ణకుమార్, రాజేశ్వరి, ఫమీమ్‌సుల్తానా, కనకలింగం, శ్రీధర్, ఉమర్, స్వామి, మంజుల పాల్గొన్నారు.

### ఆర్థికసాయం ...

మర్కూక్, డిసెంబర్ 16: మండలంలోని నర్సన్నపేట గ్రామానికి చెందిన ఎంబరి సంగయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. సోమవారం బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు,సేవారత్నం అవార్డు గ్రహీత పాములపర్తి కనకయ్య మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

### నీరు లేక విద్యార్థుల అవస్థలు



బెజ్జంకి, డిసెంబర్ 16: మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో నీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ట్యాప్ ఉన్నా నీరు సరిగ్గా రావడం లేదు. భోజనం చేసిన తర్వాత చేతులు, పేట్లు కడుక్కునేందుకు విద్యార్థులు రోడ్డుపై ఉన్న ట్యాంకు, నీటి వసతి ఉన్న ప్రాంతాలకు వెళ్తున్నారు. పాఠశాలలో నీటి వసతి కల్పించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలుస్తాం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 16: స్థానిక ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలుస్తామని ధర్మసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విశారాధన్ అన్నారు. సిద్దిపేటలో సోమవారం ధర్మసమాజ్ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మజమాజ్ జిల్లా అధ్యక్షుడు సదన్, రాష్ట్ర కార్యదర్శి రవిబాబు, సత్తయ్య, రాజు, యాగదిరి, జ్యోతి, మల్లేశం, నందు, అంజిబాబు, సతీశ్, సురేశ్, ప్రసన్న, సుధాకర్, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గజ్వేల్, డిసెంబర్ 16: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని రిమ్మనగూడ రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి గ్రామానికి చెందిన మోతె సుధాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి కొంతకాలంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడకు ఉపాధి కోసం వెళ్లి అక్కడే ఉంటున్నాడు. సుధాకర్ చిన్నాన్న కొద్ది రోజుల క్రితం మృతి చెందగా సోమవారం దశదిన కర్మ నేపథ్యంలో మిరుదొడ్డికి కారులో బయలుదేరారు. రిమ్మనగూడ రింగురోడ్డు వద్ద రాజీవ్ రహదారి దిగి తొగుట వైపు వెళ్లే క్రమంలో కారును మలుపు తిప్పుకొని వెళ్తుండగా ముందు వెళ్తున్న జగిత్యాల బస్సును గమనించకుండా వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. కారులో ప్రయాణిస్తున్న సుధాకర్ భార్య శ్రావణి(32)కి తీవ్ర గాయాలుకావడంతో గజ్వేల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సుధాకర్‌తో పాటు ఆయన తమ్ముడు గణేశ్, కుమారులు సాయి, లతీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.